విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 08 మే 2025   8 పేజీలు

ఉగ్రవాదం, మతోన్మాదంపై పోరాటం

- మోదీకి ప్రజల రక్షణ కంటే బీహార్ ఎన్నికలే ప్రధానం
- భారత సైన్యానికి మద్దతు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు: దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న ఉగ్రవాదం, మతోన్మాదంపై పోరాటం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ గత నెల 22వ తేదీన పహల్గాం దాడి ఘటనలో పర్యాటకులు చనిపోవడం దురదృష్టకరం అన్నారు. పహల్గాం దాడి ఘటన భద్రత వైఫల్యమే అని పేర్కొన్నారు. 370వ అధికరణం రద్దు చేసిన తర్వాత కాశ్మీర్లో తీవ్రవాదం సమస్య పోయిందని ఆర్భాట ప్రకటనలు చేశారని, పహల్గాం దాడి ఘటనతో తీవ్రవాదం అంతం కాలేదని రుజువైందన్నారు. మోడీ అనుసరించిన రాజకీయాల దుష్పరిణామాలు ఎలా ఉంటాయో పహల్గాం ఘటన తరువాత వివిధ రాష్ట్రాలలో ఉన్న కాశ్మీరులపై దాడులు నిరూపిస్తున్నాయని తెలిపారు. దేశంలో ప్రజల మాన ప్రాణాల కన్నా ప్రధాని మోడీకి బీహార్ ఎన్నికలు ముఖ్యం అయ్యాయని విమర్శించారు. ఉగ్రవాదులు కూడా లౌకిక తత్వంతో కూడిన భారత్ లో మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని విమర్శించారు. ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా సైనికులు తీసుకునే చర్యకు సిపిఐ మద్దతు ప్రకటిస్తుందన్నారు. చత్తీస్గడ్‌లో మావోయిస్టులతో పోరాడే సాకుతో సాయుధ బలగాలను అడవులలోకి దింపి అమాయక ఆదివాసీలను చంపుతున్నారని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ▶మిగతా 2లో..

సుందరనగరంగా రాజమహేంద్రవరం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : పుష్కర పనుల్లో భాగంగా రాజమహేంద్రవరం నగరాన్ని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రూ. 8 కోట్ల నిధులతో రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రామినేడ్ అభివృద్ధి పనులకు గోదావరి గట్టున ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర కమిషర్ కేతన్ గర్గ్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత శిలా ఫలకాన్ని ▶మిగతా 2లో..

అల్లూరి పోరాట స్ఫూర్తితో మోదీ విధానాలపై పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమండ్రి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో మోడీ వ్యతిరేక విధానాలపై మరో స్వతంత్ర పోరాటం చేయవలసిన సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం అల్లూరి సీతారామరాజు ▶మిగతా 2లో..

అల్లూరి ఆశయ సాధనకు పునరంకితం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటపటిమ, దేశభక్తి అందరికీ ఆదర్శం కావాలని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం భీమవరం సీపీఐ జిల్లా కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి 27 ఏళ్ళ వయసులో దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితమైన పాత్ర నిర్వహించారన్నారు. విశాఖ, అడ్డతీగల తదితర మన్యం ప్రాంతాల్లో గిరిజనులను దోచుకుంటూ చిత్రహింసలకు గురిచేస్తున్న బ్రిటిష్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్యపరచి యుద్ధవిద్యలు, గెరిల్లా పోరాట పద్ధతులు నేర్పించి పోరాటాలకు సన్నద్ధ పరచి బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు. నేడు స్వపరిపాలనలోను గిరిజనులు ఎలాంటి హక్కులు లేకుండా దోపిడీకి గురవుతున్నారన్నారు. అడవులను విధ్వంసం చేస్తూ గిరిజనులు జీవించే హక్కు హరించి వేస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ సంపద కార్పోరేట్ లకు అప్పచెప్పేందుకే వందలాది మంది అమాయక, ఆదివాసీ గిరిజనులను నక్సలైట్లుగా ముద్రవేసి హతమారుస్తున్నారన్నారు. గిరిజనుల హక్కులు పరిరక్షణే అల్లూరికి మనం అర్పించే నిజమైన నివాళి అంటూ భీమారావు జోహార్లర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు మల్లుల శ్రీనివాస్,ప్రజానాట్యమండలి గాయకుడు తిరుమాని చంటిరాజు, అరసం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు అల్లూరికి నివాళులర్పించారు.

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో: విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కొత్తపూసలమర్రు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ దేశం కోసం స్వతంత్ర పోరాటంలో ▶మిగతా 2లో..

ధాన్యం సేకరణలో రైతులకు నష్టం జరగకుండా చర్యలు

- రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- రైతుల ఖాతాలో రూ.390 కోట్లు జమ
- జెసి ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రస్తుత రబీ సీజన్లో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు నష్టపోకుండా అన్ని పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వెల్లడించారు. లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు విషయంలో ఇప్పటికే రైతులఖాతాలో రూ.390 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం కొనుగోలుకు నిర్ణయించిన ఎంఎస్పి ధర కంటే రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. బుధవారం ఏలూరులోని కలెక్టరేట్లో గల జేసీ చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ దాత్రిరెడ్డి రబీ ధాన్యం సేకరణ వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీలో ధాన్యం అధిక దిగుబడులు వచ్చాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఈ-క్రాప్‌లో నమోదైన 78 వేల ఎకరాలలో 3.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుత ▶మిగతా 2లో..

నూతన రైస్‌కార్డుల నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో నూతన రైస్ కార్డుల నమోదుతో పాటు రైస్ కార్డులకు సంబంధించి మరో 6 సేవలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా బుధవారం నుండి ప్రారంభించినట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నూతన రైస్ కార్డుల కోసం ఇప్పటి వరకూ అందిన దరఖాస్తులను, కొత్తగా పెట్టుకునే దరఖాస్తులను ▶మిగతా 4లో..

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఈనెల 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియేట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్ధులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్మీడియేట్ మొదటి ఏడాది సప్లమెంటరీ పరీక్షలకు జనరల్, ఒకేషనల్‌కు 10,068 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం జనరల్ ఒకేషనల్ కోర్సులకు 3,035 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసేందుకు 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు ▶మిగతా 4లో..

సబ్ కలెక్టర్ భూముల తనిఖీ

విశాలాంధ్ర-లింగపాలెం: నూజివీడు రెవిన్యూ సబ్ డివిజన్ సబ్ కలెక్టర్ స్మరణరాజ్ లింగపాలెం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల అవసరాల కోసం సహకార సంఘాల పరిధిలో గోదాములు నిర్మించేందుకు స్థలాలను సేకరించారు. అప్పట్లో స్థలాలు సేకరించినా గోదాముల

నిర్మాణాలు జరగలేదు. ఈస్థలాల తీరుతెన్నులు స్వయంగా తెలుసుకునేందుకు సబ్ కలెక్టర్ మండలంలోని భోగోలు, వేములపల్లి, ఆసన్నగూడెం, కొత్తపల్లి, సింగగూడెంలో పర్యటించి ఆనాడు సేకరించిన స్థలాలను పరిశీలించారు. వీటికి సంబంధించి రెండెకరాల 64 సెంట్ల భూమిని గత ప్రభుత్వంలో సేకరించారు. ఇవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. సేకరించిన భూములు ఎలా ఉన్నాయి అనే దానిపై సబ్ కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ భూములను ఉపయోగంలోకి తీసుకొచ్చే చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని స్మరణ్ రాజ్ తాసిల్దార్ ప్రసాద్ రెవిన్యూ సిబ్బందికి తెలిపారు. ఇవి అన్యాక్రాంతం కాకుండా చూడవలసిన బాధ్యత స్థానిక రెవిన్యూ సిబ్బందిపై ఉందని సబ్ కలెక్టర్ సూచించారు.

ప్రారంభమైన పంట కాలువల ప్రక్షాళన

విశాలాంధ్ర - పాలకోడేరు : మండల వ్యాప్తంగా ఉన్న పంట కాలువలను ఉండి శాసనసభ్యులు, ఉప సభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజు సహ కారంతో ప్రక్షాళన పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చూస్తా మని పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ కునాధరాజు మురళీకృష్ణ రాజు తెలిపారు. బుధవారం మండలంలోని వేండ్ర గోస్తని చానల్, శృంగ

వృక్షం అదవి పూడి కాలువ పూడిక తీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ లీలా కృష్ణ కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి బాబు, ఏడుకొండల రాజు, కలిదిండి బుజ్జి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం (1వ పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. అనంతరం గ్యాలరీలో నమూనా ఫోటోలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ.. గోదావరి నదీ తీరంలో ఉన్న రాజమహేంద్రవరం నగరాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత నగర జనాభా 5 లక్షలు కాగా.. పుష్కర సమయంలో రోజు 10 లక్షల మంది ఈ ప్రాంతానికి వస్తారనే అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరచడానికి పుష్కరాలే ఓ మంచి వేదిక అని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సమీకరించి.. కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అడుగులు వేద్దామన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం అభివృద్ధిలో భాగంగా రూ. 8 కోట్ల రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రామినేడ్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. దిగువన వేమగిరి నుంచి బొబ్బర్లంక వరకు కూడా గోదావరి గట్టును అభివృద్ధి పరచడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నగర కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ.. రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్ గా మార్చడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గడిచిన 10 నెలల కాలంలో నగరంలో రూ. 220 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. వీటిలో రూ. 128 కోట్లు పుష్కర పనులు కాగా పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సభాధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్చరల్ క్యాపిటల్ గా ఉన్న రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్ గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధి అనేది నగర ప్రజల 15 ఏళ్ల కల అని పేర్కొన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు కూడా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఓవైపు గోదావరి నది., మరోవైపు కొండప్రాంతాలు, కోనసీమ అందాలు ఈ ప్రాంత టూరిజంకు ఎంతో దోహదపడే అంశాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ప్రజా ప్రతినిధులు చల్లా శంకర్ రావు, గన్ని కృష్ణ, అధికారులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

చర్యలు (1వ పేజీ తరువాయి)

రబీలో రైతుల నుండి ఇప్పటివరకు రూ.501 కోట్ల విలువ చేసే 2.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. గత 10 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ప్రస్తుత రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్ణయించామన్నారు. జిల్లాలో 180 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణ కేంద్రంలోను, మిల్లర్ల వద్ద తేమ శాతం కొలిచేందుకు ఒకే రకమైన యంత్రాలను వినియోగించిన కారణంగా తేమశాతంలో వ్యత్యాసం సమస్య పూర్తిగా తొలగిపోయింద న్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడా ధాన్యం దెబ్బతినలేదని, రైతుల నుండి ఎటువంటి ఫిర్యాదులు నమోదు కాలేదన్నారు. 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యంగా ఎఫ్సీఐకి నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శివ రామ్మూర్తి, డీఎస్ఓ ప్రతాపరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీ, ప్రభృతులు పాల్గొన్నారు.

పునరంకితం (1వ పేజీ తరువాయి)

చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన అల్లూరి జరిపిన విప్లవాత్మకపోరాటం ప్రతి వ్యక్తి ఆదర్శప్రాయంగా తీసుకోవాలని అన్నారు. ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ నేటి పాలకులు రైతులను, వ్యవసాయ కార్మికులను పేద ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పాలకులు తమ విధానాలకు స్వస్తి పలికి అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని అన్నారు. భీమవరం ఫ్లైఓవర్కు అల్లూరి పేరు పెట్టాలని ఆయన అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమ సమాజం కోసం అల్లూరి పాటుపడ్డారని, ఆయన ఈ దేశం కోసం మన్య ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించారని అన్నారు. తొలుత అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నాయకుడు తిరుమాని కామేశ్వరరావు, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి తిరుమాని శ్రీరాములు, పంచాయతీ ఉపాధ్యక్షులు జనసేన నాయకులు బర్రె నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు బస్వాని వెంకటరమణ, ఉపాధ్యాయులు అబ్రహం, సిపిఐ నాయకులు వాటాల రాధా కృష్ణ, తిరుమాని లక్ష్మీనారాయణ, మల్లాడి సత్యనారాయణ, జిల్లా అర్జున్ రావు, వాటాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: అల్లూరి సీతారామరాజు ఆశయాలను నేటి యువత ఆచరించాలని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పిలుపునిచ్చారు. మన్యం వీరుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీవీఎస్ రాజు మాట్లాడుతూ విప్లవ జ్యోతి సీతారామ రాజు బ్రిటిష్ ముష్కరుల నుండి భారతదేశానికి విముక్తి కల్పించాలని దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు.

అల్లూరి ఆశయాలకు నేటి పాలకులు తూట్లు పొడుస్తూ ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం. భీమరాజు, సాహిత్య అభిమాని అభిమాని పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : స్వాతంత్ర్య సముపార్జనలో పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయులని ఎంపీడీవో వై. రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ ప్రాంగణంలో స్వాతంత్ర సమరయోధులు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో అసువులు బాసిన అల్లూరి

నేటి యువతకు ఆదర్శమన్నారు. అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ఏపీఎంఓ కె. శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం. సుబ్బారావు, ఉపాధి హామీ , మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటం (1వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నట్లు కేంద్రం చెబుతున్నప్పటికీ అడవు లలో నివసిస్తున్న ఆదివాసీలను తరిమికొట్టి అటవీ ఖనిజ సంపదలు,ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే లక్ష్యంగా బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది పెత్తనం రుద్దడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ అలుపెరుగని పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైం దన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించిన సీపీఐ సీనియర్ నాయకులు మారిన వెంకటరావుకు, పహల్గాం దాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబా,మైసాక్షి వెంకటాచారి, పుప్పాల కన్నబాబు, బాడిస రాము, జెవి రమణ రాజు, కొండేటి బేబి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్ర శిబిరాలపై దాడులకు ప్రజల సంఘీభావం

విశాలాంధ్ర-లింగపాలెం: పాకిస్తాన్లోని ఉగ్రవాదుల శిబిరాలపై భారత్ దాడులు చేయటం పట్ల జై హింద్ భారత్ అనే నినాదాలు మిన్నంటాయి. ఉగ్రవాదులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ సమర్థిస్తూ లింగపాలెం మండలంలో సంఘీభావం తెలిపారు. మండల కేంద్రమైన లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో

అధికారులు, ఉద్యోగులు,ప్రజా ప్రతినిధులు, సామాన్య ప్రజలు పాల్గొని భారత్ తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. పాక్ ఉగ్రవాద దాడుల్లో భారతదేశంలోని అమాయకులు బలైపోతున్నారని ఎంతకాలం ఉగ్రవాదుల ఘాతుకానికి భారతీయులు బలి అవ్వాలంటూ ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వాణి, డిప్యూటీ ఎంపీడీవో రత్నకుమార్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పేరుతో బీసీలను దగా చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే కుట్టు మిషన్ల పేరుతో బీసీలను కూటమి ప్రభుత్వం దగా చేస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సూర్య బలిజ విభాగం అధ్యక్షులు శెట్టి త్యాగరాజు అన్నారు. బుధవారం గణపవరం గ్రామంలో ఉన్న ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో

మాట్లాడుతూ బీసీ మహిళలకు చేయూత కింద ఇచ్చే కుట్టు మిషన్లను కూడా సక్రమంగా అందిస్తున్న నమ్మకం లేదని అన్నారు. కూటమి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాసిరకమైన కుట్టు మిషన్లను లబ్ధిదారులకు పంచిపెట్టి సుమారు రూ.245 కోట్లను ప్రభుత్వం దోచుకుంటుందని అన్నారు. ఇందులో ప్రధానంగా ఒక్క మహిళకు రూ.23 వేలు కేటాయించగా, కుట్టు మిషన్ కొనుగోలుకు కేవలం రూ.4,300, టైలరింగ్ శిక్షణకు రూ.3000 అని ఇలా ఒక్కొక్క బీసీ మహిళ లబ్ధిదారునికి కుట్టు మిషను శిక్షణకు అయ్యే మొత్తం ఖర్చు రూ.7300 మాత్రమేనని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ఈ అవినీతి బాగోతాన్ని అరికట్టాలని త్యాగరాజు కోరారు.

అల్లూరి పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-భీమడోలు: అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మానవతా జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వర రావు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయాల పరిధిలోని భీమడోలు నెంబర్ వన్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవిజ్ఞాన శిక్షణ

కార్యక్రమాలు 9వ రోజైన బుధవారం ఘనంగా జరిగాయి. గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమాలకు వివిధ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులకు నీతి కథలు చెప్పడం, తెలుగు భాష పై పట్టు సాధించేలా అవగాహన కల్పించడం, గణితము,జీకే వంటి అంశాలపై శిక్షణ అందించారు. అనంతరం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు101వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో (1వ పేజీ తరువాయి)

వర్ధంతి సందర్భంగా స్థానిక గణేష్ చౌక్ వద్ద ఆయనకు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి, జట్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు కొండ్రపు రాంబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే ఈ దేశ స్వతంత్రం కోసం సాయుధ పోరాటం చేసి అమరులైన గొప్ప విప్లవ వీరుడు అల్లూరి అని కొనియాడారు. బ్రిటిష్ తెల్ల దొరలు ఈ దేశం నుండి తరలిపోవాలని తమ పాలన తామే చేసుకుంటామని చెప్పిన సీతారామరాజు మాటలు ఇప్పటికీ నెరవేరలేదని ఆయన అన్నారు. అడవిలో ఉన్న సహజ వనరులను ఆదాని, అంబానీలకు దోచి పెట్టేందుకే చట్టాలను తయారు చేస్తున్నారని విమర్శించారు. బ్రిటిష్ కాలంలోనే కార్మికులకు చట్టాలు ఉన్నాయని నేడు మోడీ కాలంలో ఆనాటి చట్టాలు ఎత్తివేసి నాలుగు లేబర్ కోడ్ లుగా ప్రవేశపెట్టారని దీంతో కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు పోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కొండ్రపు రాంబాబు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నల్ల రామారావు, సేపేని రమణమ్మ, టి.నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, మహిళా సమాఖ్య నాయకురాలు శెట్టి నాగమణి, జట్ల సంఘం అధికారబాడీ నాయకుడు పి. దేవుడు బాబు, ఆర్.బాలకృష్ణ, ఆర్.వెంకట్రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోదించడం అందరి బాధ్యత : సీడీపీవో లక్ష్మీకాంతం

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం విస్సాకోడేరు సిడిపిఓ భవనం హాలులో గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బుధవారం మానవ అక్రమ రవాణా పైన అవగాహనా

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ లక్ష్మీ కాంతం మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే అతి పెద్ద నేరంగా ఉందని,ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీనికి గురి అవుతున్నారని , ప్రతి ఒక్కరు దీని పైన అవగాహనా కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించి రక్షించాలని అన్నారు. ఈ అక్రమ రవాణాకు మరియు లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 29,200 మంది మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్టు తెలిపారు. సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అక్రమ రవాణా ను అరికట్టడం లో అందరు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమత్తంగా ఉంటారని అన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుండి మెసేజ్ గాని కాల్స్ గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని దీనికి సంబంధించి ప్రభుత్వం ఏర్పరిచిన 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల ,అసిస్టెంట్ కోఆర్డినేటర్స్, అనిల్ కుమార్, చెన్నకేశవులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు,అంగన్ వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ద్వారా మెరుగైన సేవలు : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: రెడ్ క్రాస్ సేవలను ఇంకా విస్తరింపచేసి రెడ్ క్రాస్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చూడాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి రెడ్ క్రాస్ నూతన కార్య వర్గానికి సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ నూతన చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్, నూతన కార్యవర్గ సభ్యులు

బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఏలూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని రెడ్ క్రాస్ సంస్థను బలోపేతం చేసేలా, రెడ్ క్రాస్ సభ్యత్వాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి వంటి విషయాలను నూతన కమిటీ సభ్యులతో కలెక్టర్ ఈ సందర్భంగా చర్చించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎంవివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత మిరియాల అప్పారావు వారసురాలికి ఘన సన్మానం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: స్థానిక 2వవార్డు వీకర్స్ కాలనీలో నివసిస్తున్న మిరియాల అప్పారావు పద్మశ్రీ అవార్డును కైవసం చేసుకోవడం నియోజకవర్గానికి గర్వకారణమని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మిరియాల అప్పారావు వారసురాలు ఎడవల్లి శ్రీదేవిని ఎమ్మెల్యే బొలిశెట్టి ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరియాల అప్పారావు భారతదేశ కీర్తి పతాకాలను ఎగురవేసిన బుర్రకథ కళాకారులు తమ నియోజకవర్గ కాపురస్తులు కావడం తాడేపల్లిగూడెం ప్రజల అదృష్టంగా అభివర్ణించారు. రాష్ట్రపతి చేతుల మీదగా పద్మశ్రీ

అవార్డు గ్రహీతగా ఎన్నికైన వారు అకాల మృతి చెందడంతో వారి కుమార్తె శ్రీదేవి ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారని అన్నారు. ఆయన కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు.

20న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: పాలకులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మెను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మే 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెపై సిఐటియు కార్యాలయంలో బుధవారం కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే దేశ కార్మిక వర్గం త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాల్ని మార్పులు చేసి లేబర్ కోడ్లుగా మార్చడం భారతదేశ కార్మిక వర్గానికి తీవ్ర నష్టమని అన్నారు. కార్పొ రేట్ శక్తులకు లాభాలు తెచ్చి పెట్టేందుకు లేబర్ కోడ్లు మోడీ తీసుకొచ్చాడని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడం కోసం ఉద్యోగ కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఐక్యంగా కదలాలని మే 20న సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని కోనాల పేర్కొన్నారు. 10వ తేదీన జిల్లా సదస్సు నిర్వహించాలని, 12, 13, 14, 15వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహించాలని, 17, 18వ తేదీల్లో అన్ని పట్టణాలు మండల కేంద్రాల్లో

సమ్మె జయప్రదం కోరుతూ మోటార్ సైకిల్ ప్రదర్శనలు నిర్వహించాలని, పని ప్రాంతాల్లో కార్మికులు ఉండే ప్రాంతాల్లో గ్రూప్ మీటింగ్ నిర్వహించాలని, 20న మండల కేంద్రాలు, పట్టణాల్లో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని కోనాల పేర్కొన్నారు. కార్యక్ర మంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎం.రామ్మోహన్ ఐఎన్‌టియుసి నాయకులు సుబ్రహ్మణ్యం, ఏఐసీటీయు నాయకులు దండు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కూలీ భరోసా రూ.12వేలు ఇవ్వాలి

- వంద రోజులు పని కల్పించాలి
- కనీస వేతనం రోజువారి కూలి రూ.600 ఇవ్వాలి
- పని భద్రత కల్పించాలి
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న కూలీ భరోసా సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తాడేపల్లిగూడెం రూరల్ మండలం మెట్టఉప్పర గూడెం,చిన్న తాడేపల్లి, కొండ్రుప్రోలు, కుంచనపల్లి గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను పని ప్రదేశంలో కలుసుకొని వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూలీ రేట్లు పని భద్రత అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు . ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో , రైతులకు ఏ విధంగా రైతు భరోసా ప్రభుత్వం ఇస్తుందో అదేవిధంగా ప్రతి ఉపాధి కూలీకి కూలీ భరోసా రూ.12వేలు సంవత్సరానికి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ

పథకం తెలంగాణ రాష్ట్రంలో అమలవుతుందని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో విలీన గ్రామాలు ఉన్న పడాల, ఎల్. అగ్రహారం, కుంచనపల్లి, కొండ్రుప్రోలు, పట్టణానికి సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలకు ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం నాయకులు దిదే నాగేశ్వరరావు పెద్ద ఎత్తున శ్రామికులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలలో విద్యార్థులందరూ ఉత్తీర్ణులవ్వాలి

విశాలాంధ్ర -పెదపాడు: త్వరలో జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు బోధన జరపాలని డీఈవో ఎం. వెంకట లక్ష్మమ్మ అన్నారు. పెదపాడు జెడ్పి హైస్కూలులో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు జరుగుతున్న శిక్షణ తరగతులను (స్టడీ అవర్స్) బుధవారం డీఈవో సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ విద్యా సంవత్సరం వృధా అవ్వదు అని ప్రతి విద్యార్థి గ్రహించాలన్నారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించాలన్నారు.

ప్రతి విద్యార్థి పదవ తరగతి పాసై కళాశాలలో చేరి ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. డీఈఓ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి .వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ అవార్డులకు పశ్చిమ కలెక్టర్ ఎంపిక

విశాలాంధ్ర -భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షులు చదలవాడ నాగరాణి అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా 2023-24, 2024-25 సంవత్సరాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ రెడ్‌క్రాస్ అవార్డులతో సత్కరించడానికి ఎంపిక చేసింది. దీనిని పురస్కరించు కొని మే 8వ తేదీ ఉదయం 11:00 గంటలకు

విజయవాడ రాజ్ భవన్‌లో నిర్వహించే ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ నుండి అవార్డును అందుకోవాలని కోరుతూ రాజ్ భవన్ నుండి ఆహ్వానాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి అందుకున్నారు. జిల్లా కలెక్టర్ రాష్ట్రస్థాయిలో రెండు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డులను పొందడం ఎంతో సంతోషకరమైన విషయమని జిల్లా అధికారులు, సిబ్బంది, తది తరులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు.

రైతులకు సౌకర్యాలు కల్పించకపోతే నీటి తీరువా చెల్లించలేరు

– నీటి సంఘ అధ్యక్షుల వెల్లడి

విశాలాంధ్ర-లింగపాలెం: రైతులకు సౌకర్యాలు కల్పించకుండా నీటి తీరువా ఎలా వసూళ్లు చేయాలంటూ సాగునీటి సంఘ అధ్యక్షులు అధికారులను నిలదీశారు. లింగపాలెం మండలంలో నీటి తీరువా వసూళ్లపై తహసిల్దార్ ప్రసాద్ అధ్యక్షతన లింగ పాలెంలో నిర్వహిం చిన సమావేశంలో నీటి సంఘ అధ్య క్షులు సమస్యలను

ఏకరువు పెట్టారు. చెరువులు,కాలువలు ఆక్రమణలకు గురవ్వటం వల్ల సాగునీరు అందించలేని పరిస్థితుల్లో ఉన్నామని వీరు పేర్కొన్నారు. ఆయకట్టు రైతులకు సౌకర్యాలు కల్పించకుండా నీటి తీరువా వసూళ్లు అవ్వవని అన్నారు. సమావేశంలో రంగాపురం,కే. గోకవరం, ధర్మాజీగూడెం, యడవల్లికి చెందిన నీటి సంఘ అధ్యక్షులు చెల్లికాని కృష్ణారావు, ఓబిళ్ళనేని సుబ్బారావు, మోదుగుల నాగేశ్వరరావు, మొరంపూడి ప్రసాద్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇరిగేషన్ శాఖ అధికారుల తీరు సక్రమంగా లేదంటూ వీరు పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖకు చెందిన వారంతా పట్టనట్లుగా ఉంటున్నారని పేర్కొన్నారు. చెరువుల, కాలువల సమస్యలను వీరి దృష్టికి తీసుకువెళ్తే ఏమాత్రం పట్టించు కోవటం లేదన్నారు. తమ అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ కు లిఖిత పూర్వకంగా పంపాలని వీరు కోరారు. లింగపాలెం మండలంలో రూ.47 లక్షలు నీటి తీరువా వసూళ్లు కావల్సి ఉందని తహసిల్దార్ తెలిపారు.వీటిని వసూళ్లు చేయాల్సిన బాధ్యతను గ్రామ రెవెన్యూ అధికారులు తీసుకోవాలని కోరారు.నీటి తీరువా వసూళ్ల వల్ల చెరువులను కాలువలను అభివృద్ధి చేసుకోవడానికి వీలుంటుం దని వివరించారు. ఆన్లైన్ ద్వారా నీటి తీరువా చెల్లించాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో ఎంపీడీవో వాణి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు నోటీసు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుగు జాతీయ కార్మిక సంఘాల సమ్మెకు పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మున్సిపల్ సమ్మె నోటీసును బుధవారం యూనియన్ జిల్లా

అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్ ఆధ్వర్యంలో స్థానిక జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం కమిషనర్ కె.వి రమణకు అందజేయడం జరిగిందని విగ్నేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి నిమ్మల సుబ్బారావు,పారిశుధ్య విభాగం కార్యదర్శి బొక్క శ్రీనివాస రావు,అయినాల ముత్యాలరావు,దోసూరి నాగరాజు, కొత్తూరి శ్రీను, అప్పలస్వామి, ఎల్లంకి ప్రసాద్, ముప్పిడి సురేష్, నూకరాజు, కార్మికులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం ప్రయోజనకరం

విశాలాంధ్ర-ఏలూరు: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో అనేక విధాలుగా ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. బుధవారం స్థానిక కలెక్ట రేట్ గౌతమీ సమావేశ మందిరంలో వ్యవసా యంలో డ్రోన్ల వినియో గంపై గ్రూప్ కన్వీనర్లకు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం

చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపర్చడంలో, ఖర్చులను తగ్గించడంలో, సమర్థతను పెంచడంలో డ్రోన్లపాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. వ్యవ సాయ సాగులో డ్రోన్ టెక్నాలజీతో అన్నదాతకు ఆసరాగా నిలవాలని ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 27 మండలాల్లో తొలివిడతగా ప్రభుత్వ సబ్సిడీపై డ్రోన్లను అందించేందుకు దరఖాస్తులు తీసుకుంటున్నట్టు తెలిపారు. తొలివిడతగా 40 డ్రోన్లను ప్రభుత్వం జిల్లాకు కేటాయించిందన్నారు.వీటిని కొనుగోలుకు రైతులకు ప్రభుత్వం 50 శాతం వరకు సబ్సిడీని అందిస్తుందన్నారు. డ్రోన్లు తీసుకున్న రైతులు విజయవంతంగా ఎదగాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా, ఎపిఎంఐపి పిడి పి.రవికుమార్, ఎల్ డిఎం డి. నీలాద్రి, వివిధ బ్యాంకుల అధికారులు, శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్ రైతులు, పలువురు వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : వేసవికాలంలో సమయాన్ని వృధా చేయకుండా యువత, విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మిలటరీ మాధవరం గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమ్మర్ క్రికెట్

టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలోని విద్యారంగంలో రాణించాలంటే యువత విద్యతోపాటు క్రీడల్లో నైపుణ్య అభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు, క్రికెట్, వాలీబాల్,త్రో బాల్, రన్నింగ్, కబడ్డీ, లాంటి క్రీడా పోటీల్లో కృషి, పట్టుదలతో పాల్గొని జిల్లా,రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి,అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తే ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి, క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ ఆడి నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, లక్కోకుల ప్రసాద్, కసే శ్రీనివాస్, అడ్డగర్ల ప్రసాద్ క్రీడాకారులు కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు (1వ పేజీ తరువాయి)

చూడాలన్నారు. త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సెల్ ఫోన్లు అనుమతించబడవన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు సిసి కెమేరాల నిఘాలో ఉంటాయన్నారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో 08812230197 ఫోన్ నెంబరుతో కంట్రోల్ రూమ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఆర్ఐఓ కె.యోహాన్, డిఐఇవో టి. శేఖర్ బాబు, డిపివో కె.అనురాధ,ఆర్ టిసి డిఎం బి. వాణి,కొయ్యలగూడెం, కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎల్ శ్యామ్ కుమార్, కె.శ్రీనివాసరావు, విద్యుత్, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, GAYATRI NAGARAJU (New Name), W/O SATYANARAYANA RAJU, Previously Called GOTTUMUKKALA GAYITRI (Old Name), Resident of D.No:5-25, Rajula Garuvu, Konithiwada, Veeravasaram Mandalam, W.G.Dt. Pin-534240, Andhrapradesh. I have changed my name from GOTTUMUKKALA GAYITRI (Old Name) To GAYATRI NAGARAJU (New Name) for all practical purposes.

గంజాయి, బెట్టింగులపై ఉక్కుపాదం మోపండి

ఏలూరు త్రీ టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఐజి అశోక్, ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : యువత జీవితాలను నాశనం చేస్తూ చెడు మార్గంలో నడిపిస్తున్న గంజాయి వినియోగం, క్రికెట్ బెట్టింగ్ లపై ఉక్కుపాదం మోపాలని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్ సూచించారు. కీలక కేసులు గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా బాధితులకు న్యాయం చేసి నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలన్నారు. బుధవారం ఏలూరులోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజి అశోక్‌కు 3 టౌన్ సిఐ కోటేశ్వరరావు పూల మొక్కను అందజేశారు. ముందుగా ఐజీకి ఏలూరు 3 టౌన్ పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసిన ఐజి అశోక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐజి అశోక్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు పోలీసులకు చేర వేయడంలో సచివాలయ మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలని ఐజి చెప్పారు. కీలక కేసులను గుర్తించి వాటిని సాక్షాదారాలతో నిరూపించి నిందితులకు శిక్ష పడేలా చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన

కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డ్స్ లను పరిశీలించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లో సీజ్ చేయబడిన వాహనాలు మొదలైన వాటి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ లపై ప్రత్యేక దృష్టి సారించి, వారి కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఐజి అశోక్ కుమార్ ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఐజి మొక్కని నాటారు. అనంతరం ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఐజి అశోక్, ఎస్పీ కిశోర్ హెల్మెట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజి వెంట ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్, 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు, ఎస్సైలు రాంబాబు, అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాగరాజుపేటలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

రూ.4.16 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు నియోజకవర్గంలో విద్యుత్తు కష్టాలు, బాధలు శాశ్వతంగా తీరేలా రూ.250 కోట్లతో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తానని, త్వరలోనే దీని నిర్మాణ పనులు మొదలవుతాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. మంత్రి రామానాయుడు పాలకొల్లు నియోజక వర్గానికి 220 కే.వి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మంత్రిని కోరగా ఆయన పై విధంగా స్పందిం చారు. పాలకొల్లు రూరల్ నాగరాజు పేటలో రూ. 2.83 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రులు రవికుమార్, రామా నాయుడు, కేంద్రమంత్రి శ్రీనివాస్‌వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తదితరులు కలిసి ప్రారంభించారు. అంతకుముందు పాలకొల్లు పట్టణ 26వ వార్డు బెజవాడ కోడు పై రూ.42.23 లక్షలతో వంతెనకు, కొంతేరు గ్రామంలో ఆవ మీడియం డ్రైన్ పై రూ.31 లక్షలతో గ్రావెల్ రహదారి, మరో రూ.29 లక్షలతో గ్రావెల్ రహదారి, రూ.31 లక్షలతో డ్రైన్ త్రవ్వకం పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. నాగరాజు పేట వద్ద జరిగిన బహిరంగ సభలో రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చంద్రబాబు వారం వారం సమీక్షలు జరుపుతూ తగిన ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న

అభివృద్ధి సంక్షేమానికి కేంద్రం అండగా నిలుస్తుంది అన్నారు. పాలకొల్లు నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి ఉంటుందన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు వినియోగం పెరిగేలా ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభించినట్టు తెలిపారు. రాష్ట్ర సంపద దోపిడీ, లూటీపై నాటి చంద్రబాబు పోరాటం ఫలించిందన్నారు. ప్రజాహితం కోసం, జాతి సంపదను కాపాడుకోవడం కోసం తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఆర్డీవో దాసిరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ రఘునాధబాబు, టెక్నికల్ ఈఈ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు

ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాద అంతానికి శాశ్వత పరిష్కార దిశగా అడుగులు

భారత సైన్యానికి మంత్రి కొలుసు పార్థసారధి అభినందనలు

విశాలాంధ్ర-నూజివీడు: భారతదేశంతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఇప్పుడు పాకిస్తాన్‌కు అర్థమయ్యిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి బుధవారం ఒక

ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు ఇండియన్ ఆర్మీ తగిన బుద్ధి చెప్పిందన్నారు. ఆపరేషన్ సింధూర్ తో ఉగ్రవాద అంతానికి శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడనున్నాయన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు

విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రతి ఏడాది గోదావరి వరదల వలన తీవ్రంగా నష్టపోతున్నామని తమకు న్యాయం చేయమని కోరుతూ కలెక్టర్‌ను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన తాట్కూర్ గొమ్ము కాలనీ వారు బుధవారం కలిశారు. 73 కుటుంబాలు

కలిగిన తమ గ్రామంలో గోదావరి వరదలు చేకూరుస్తున్న నష్టాన్ని కలెక్టర్ కు వివరించారు. తమ గ్రామాన్ని 41.15 కాంటూర్ పరిధిలో కలిపి ముందుగా పునరావాసం కల్పించాలని కోరారు. విషయంపై స్పందించిన కలెక్టర్ గ్రామసభలు నిర్వహించినప్పుడు సహకరించాలని తద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుంద న్నారు. ముంపుకు గురవుతున్న ప్రతి గ్రామానికి న్యాయం చేస్తామని ఆమె తెలిపారని అన్నారు. కేదాసి స్పందన, అర్జా బిక్షంరావు ,వలపర్ల చిట్టిబాబు, లాడే అనసూయ, కేదాసి విష్ణు, మానుపల్లి జయమ్మ, సంబారి కనక, నిర్మల, సీత తదితరులు కలెక్టర్‌ను కలిశారు.

అల్లూరి సీతారామరాజు ఉద్యమస్ఫూర్తితో యువత పోరాడాలి

విశాలాంధ్ర- చింతలపూడి: అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తితో యువత పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. అల్లూరి 101వ వర్థంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఏఐవైఎఫ్

ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. 2014కి ముందు నరేంద్ర మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఈ దేశ నిరుద్యోగ యువతను మోసం చేశాడని కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ అందులో ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పిట్టా చందు, సంబారి కార్తీక్, తొర్లపాటి అంబేద్కర్, కొండా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నమోదు ప్రారంభం (1వ పేజీ తరువాయి)

సచివాలయాలలో ఏపి సేవా ప్లాట్ ఫారమ్ ద్వారా నమోదు చేసేందుకు మండల, సచివాలయ సిబ్బందిని సంసిద్ధం చేసామని ఆయన తెలిపారు. నూతన రైస్ కార్డుల నమోదుతోపాటు రైస్ కార్డుల విభజన, రైస్ కార్డులలో సభ్యుల చేర్చడం, సభ్యుల తొలగింపు, రైస్ కార్డు సరండర్ చేయడం, కార్డులో చిరునామా మార్పు, తప్పుగా నమోదైన రైస్ కార్డు ఆధార్ సీడింగ్ సవరణ సేవల కొరకు కూడా ప్రజలు సచివాలయాలను సంప్రదించ వచ్చునని తెలియజేసారు. రైస్ కార్డులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ సేవలను జిల్లాలో అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమ ప్రకటనలో కోరారు.

రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న నిర్వాసితులు

- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- భారీ బందోబస్తు మధ్య బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-మామిడి కుదురు : పాశర్ల పూడి గ్రామంలోని కైకాలపేటలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. 216వ నంబర్ జాతీయ రహదారి వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎన్‌హెచ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రయత్నించారు. దీన్ని నిర్వాసితులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. తమకు సెంట్ల రూపేణా పరిహారం ఇస్తామంటున్నారని అలా కాకుండా గజాల లెక్కన, ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంతోకాలం నుంచి పోరాటం చేస్తున్నా తమకు న్యాయం చేయడం లేదంటూ తీవ్రంగా మండిపడ్డారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, నగరం ఎస్సై ఎ చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు నలుగురిని పోలీసులు అదుపు లోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం భారీ బందో బస్తు నడుమ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించారు. పాశర్లపూడి గ్రామంలోని బైపాస్ రోడ్డు నిర్మాణానికి 66 మంది రైతులకు చెందిన ఏడెకరాల భూమికి సంబంధించి సమస్య ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీనిలో 10 మంది రైతులు నష్ట పరిహారం తీసుకున్నార న్నారు. మిగిలినవారు పరి హారం తీసుకోలేదని చెప్పారు. ఇందులో 16 మంది రైతులకు సంబంధించి 1.32 ఎకరాల భూమిని ఇచ్చేందుకు నిర్వాసితులు నిరాకరించడంతో ఇంత కాలం బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపట్టామని చెప్పారు.

9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-దేవరపల్లి : ఈ నెల 9న దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె వి కె దుర్గారావు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు 30 నిమిషాలకు జరుగుతుందని దేవరపల్లి ఎంపీ డీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈనెల ఏడో తేదీ జరగవలసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చబడిందని మరల ఈనెల 9వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు 30 నిమిషాలకు ఎంపీపీ కేవీకే దుర్గా అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు గ్రామ కార్యదర్శులు ఎంపీటీసీలు సర్పంచులు తప్పక హాజరు కావలసిన ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి కోరారు.

గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు..

బెంబేలెత్తుతున్న వినియోగదారులు..

విశాలాంధ్ర- కొవ్వూరు : గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ చేసే వ్యక్తులు అదనపు వసూళ్లకు పాల్పడుతడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అసలే నేటి రోజుల్లో గ్యాస్ ధరల రూ.850లు చేస్తున్నారు పెరుగుదలను భరిస్తున్న వినియోగదారులు మరోవైపు ఇదేం పరిస్థితి అని వాపోతున్నారు వాస్తవంగా రూ.885 సిలిండర్ ధర ఉండగా దానికి అదనంగా మరో రూ.50లు ముక్కుపిండి మరి వసూలు చేస్తున్నారు. ఇదే విషయమై కొంత మంది గృహిణులు కొవ్వూరులోని హెచ్పీ గ్యాస్ కంపెనీకి ఫోన్ చేయగా మీరు అదనంగా ఎందుకు ఇచ్చారు అని అటువైపు నుంచి బదులు వచ్చింది. దీంతో ఆ కంపెనీ వారు ఆ డెలివరీ వ్యక్తిని మీ ఇంటికి పంపి స్తాం మాట్లాడండి మీకు బిల్లు ఇవ్వలేదా అన్న సమాధానం వచ్చింది దీంతో హుటాహుటిన గ్యాస్ డెలివరీ చేసిన వ్యక్తి ఆ ఇంటికి వచ్చిన డెలివరీ వ్యక్తి ఆ యాభై రూపాయలు తెచ్చినందుకని బదులిచ్చాడు. మరి బిల్లు ఏది అని ప్రశ్నిస్తే బిల్లు నా దగ్గర లేదు మేడం అని చెబుతూ నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

ఘనంగా వాసవి మాత జయంతి

విశాలాంధ్ర-జగ్గంపేట : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద బుధవారం శ్రీ వాసవీ మాత జయంతి వేడుకలను ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుతగా ఉదయం సుప్రభాత సేవతో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మేలు కొలుపు పాడారు. తదుపరి వాసవీ మాత మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఉగ్ర శిబిరాలు ధ్వంసం సైనిక సత్తాకు నిదర్శనం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఉగ్ర శిబిరాల ధ్వంసం మన సైనిక సత్తాకు నిదర్శనమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ధీమా వ్యక్తంచేశారు. భారత సైన్యం పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పిందని ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో జాతీయ జెండాలతో ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం మారణకాండకు భారత్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు జరిపి విజయవంతంగా వాటిని ధ్వంసం చేసిన తీరు భారతీయులకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందన్నారు. ఈ ఆపత్కాల సమయంలో భారతీయులందరూ ప్రభుత్వానికి అండగా నిలబడి సైనికులకు మనోధైర్యాన్ని కల్పి ద్దామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలి. ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం వద్దిపర్రులో నూతన ఆర్‌ఓ వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు రాజమండ్రి ఫణీంద్ర స్కానింగ్ సెంటర్ వారి సౌజన్యంతో ఆత్రేయపురం మం డలం వద్దిపర్రు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంటును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), జే శ్యామల హరిబాబు గ్రామ సర్పంచ్, జె రమేష్, కుటమి నాయకులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం పై ఎమ్మెల్యే ఆగ్రహం

విశాలాంధ్ర-అనపర్తి : ఉన్నతాధికారులపై తాను ఒత్తిడితెచ్చి టార్గెట్లు పెంపొందిస్తే కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యం కారణంగా రైతులు యధావిధిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం పందలపాక, కొంకుదురు రైతు సేవా కేంద్రాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి ఆకస్మిక తనిఖీ చేసేది నిర్వహించారు. తనిఖీలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయకుండా వెనక్కి పంపడాన్ని ఎమ్మెల్యే గుర్తించి ఉద్యోగులను నిలదీసి నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులను తీవ్రంగా హెచ్చరించారు.

ప్రజా భద్రతపై కరపలో మాక్ డ్రిల్

విశాలాంధ్ర - కరప : భారత్ పాకిస్తాన్ యుద్ధ వాతావరణ నెలకొన్న పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కరప మండల కేంద్రం నందు మాక్ డ్రిల్ నిర్వహించారు. తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం అనుపమ, డిప్యూటీ తహసీల్దార్ దుర్గాప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, ఫైర్ సిబ్బంది ముఖ్య అధికారులతో కరప మెయిన్ రోడ్డు నందు మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైమానిక దాడులు జరుగుతాయని సమాచారం ఉన్నప్పుడు ప్రభుత్వ అధికారికంగా జిల్లా యంత్రాంగం సైరన్ మోగించడం జరుగుతుందని, అటువంటి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఇంట్లో ఉన్న లైట్లను ఆర్పి వేసి, గ్యాస్ సిలిండర్లను విద్యుత్ పరికరాలను వాహనాల లైట్లను మూసివేసి, బహిరంగ ప్రదేశాలలో తిరగకుండా, భద్రత కలిగిన ఇంటిలో ఉండాలని, కిటికీలను నల్లటి పరదాలతో కప్పి ఉంచుకోవాలని తెలిపారు. యుద్ధ ప్రతికూల సమయంలో విద్యుత్ తొలగించడం జరుగుతుందని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య వార్తలను నమ్మరాదని ప్రభుత్వాధికారికంగా వచ్చిన వాటిని మాత్రమే నమ్మాలని తహసీల్దార్ అవగాహన కల్పించారు. ఇండస్ట్రీస్ ఉన్నచోట లైట్లు ఆఫ్ చేసి ప్రధానికి సెంటర్లలో నల్లటి పర్దాలను కప్పి జాగ్రత్తలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, హెల్త్ సిబ్బంది, మండల వివిధ శాఖల అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు

విశాలాంధ్ర-ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయములో ఆయన చిత్ర పటానికి ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్, మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్ని పిడుగు అల్లూరి సీతారామరాజు అని, మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అని, రెండేళ్ల పాటు బ్రిటీషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన సీతారామరాజు తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారు అని ఆమహావీరుడిని ఒకసారి స్మరించుకుందాం అని తెలిపారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ సిబ్బంది, సిహెచ్ విజయ రెడ్డి, ఎపిఓ, (ఎన్ఆర్ఇజిఎస్), గ్రామ సచివాలయ సిబ్బంది మరియు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో రాజంపేట గ్రామ శివారులో బుధవారం పేకాట శిబిరం పై ఎసై డి రామ్ కుమార్ సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ వచ్చిన సమాచరం ఆధారంగా రాజపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని వారి వద్ద నుండి రూ.8270ల నగదు పట్టుకొని వారిపై కేసునమోదు చేయడం జరిగింద న్నారు. ఏ గ్రామంలో నైనా కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చట్ట ప్రకా రం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట ఆడుతున్నట్లు సమాచరం ఉంటే పోలీసులకు తెలిపారు అని కోరారు.

ప్రజలు రైస్ కార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీఓ

విశాలాంధ్ర - సీతానగరం: ప్రజలు రైస్ కార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారిని ఎమ్ భారతి అన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భారతి విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏడు రకాల రైస్ కార్డు సేవలను అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది అని అన్నారు. ఈ సేవల్లో కొత్త రైస్‌కార్డు జారీ, కొత్త సభ్యులను రైస్ కార్డులో జోడించడం, రైస్ కార్డు విభ జన, రైస్ కార్డులో సభ్యుడి తొలగింపు, రైస్ కార్డును తిరిగి ఇచ్చివేయడం, రైస్ కార్డులో చిరునామా మార్పులు, రైస్ కార్డులో సభ్యుని ఆధార్ తప్పుగా జత చేయబడినపుడు సరిచేయడం వంటి సేవలు ఉన్నాయన్నారు. కావున ప్రజలు అందరూ ఈ సేవలను ఆమోదించిన విధివిధానాల ప్రకారం అందుతాయని అన్నారు. ఈసేవలను మీగ్రామాల్లో సచివాలయాలలో పొందాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-దేవరపల్లి:దేవరపల్లి సాయి శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బి ఎండి బోన్ మినరల్ డెన్సిటీ ఉచిత వైద్య శిబిరం బుధవారం జరిగింది. ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు ఈ ఎస్ ఆర్ యూరిక్ యాసిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. హస్పటల్ కోఆర్డినేటర్ తలసిల సాయికిరణ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో ప్రశాంతంగా ఏపీఐ సెట్ -2025 ఏగ్జామ్స్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏపి ఐ సెట్-2025 ఆన్ లైన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9-00 గంటలకు ప్రారంభమైన ఎగ్జామ్స్ మధ్యాహ్నం 11-30 గంటల వరకు జరిగాయి. అదే విధంగా మధ్యాహ్నం 2-00 నుంచి సా.4-30 గంటలకు ముగిసాయి. ఉదయం ఆదిత్య యూనివర్సిటీ సెంటర్ నందు 150 మందికి గాను 136 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ నందు 200 మందికి గాను 185 మంది, మధ్యాహ్నం ఆదిత్య యూనివర్సిటీ సెంటర్ నందు 150 మందికి గాను 133 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ నందు 200 మందికి గాను 178 మంది హాజరు అయ్యారని తెలిపారు.

గిరిజనుల పోరాట యోధుడు అల్లూరి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

విశాలాంధ్ర-కాకినాడ : స్వాతంత్ర పోరాటంలో మన్యం ప్రాంతంలోని గిరిజనుల సమీకరించుకొని బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన గొప్ప పోరాటయోధుడు అల్లూరి సీతారామ రాజు అని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. బుధవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పాడా పీడీ చైత్ర వర్షిణి ఇతర శాఖల అధికారు లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ తెలుగు నేల మీద స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులలో అల్లూరి సీతారామరాజు ఒకరన్నారు. భారత స్వాతంత్ర సంగ్రామానికి మన్యంలో ఎందరో పోరాట వీరులను తీర్చిదిద్ది బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు సీతారామరాజు అని ఆయన కొనియాడారు. మన్యం ప్రజల హక్కుల కోసం, దేశ స్వాతంత్ర కోసం పోరాడి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జేసీ తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో మల్లికార్జున రావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కడియంలో ఆరుగురికి గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలంలో ఆరుగురు సచివాలయ గ్రేడ్ 6 కార్యదర్శులు (డిజిటల్ అసిస్టెంట్) లకు గ్రేడ్ 5 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఇటీవల ఈ మండలం నుంచి నలుగురు గ్రేడ్-5 కార్యదర్శిలు గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శిలుగా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఆరుగురు గ్రేడ్ 6 కార్యదర్శులను గ్రేడ్ 5 కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు మురమండ 1 సచివాలయం నుంచి మర్రి కాశీ విశ్వనాథ్, కడియపులంక -1, 2, 3 సచివాలయాల నుంచి దూడల రాఘవ, ఆకుల జగదీష్, గూడాల సుబ్రహ్మణ్యం, వేమగిరి 1 నుంచి కె ప్రతాప్ రాజు, దుళ్ల 2 నుంచి చింతా యమున లకు పదోన్నతి లభించింది. వీరందరికీ ఈనెల 14న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో కౌన్సిలింగ్ ద్వారా స్థానాలను కేటాయిస్తారు. పదోన్నతి పొందిన వీరిని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ఎంపీడీవో కె రమేష్, మండల పరిషత్ ఎఒసుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్‌దాస్ అభినందించారు.

వల్లి భాష కుటుంబాన్ని పరామర్శించిన ఫారుక్ షిబ్లి

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో కుమార్తెను వేధింపులకు గురి చేయడం తో ఫోక్స్ కేసులో నిందితు డిగా ఉన్న శిరంగల అనిల్ బాలిక తండ్రి వల్లి భాషను సోమవారం అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన పాఠకులకు విధితమే. హత్యకు గురైన వల్లి భాషా కుటుంబాన్ని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ అధ్యక్షుడు మహమ్మద్ ఫారూఖ్ షిబ్లి పమర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వల్లి భాష కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. కుమార్తెను వేధింపులు గురి చేయడంతో ఒక తండ్రి ఏ విధంగా అయితే స్పందించాలో ఆ విధంగానే స్పందించిన భాషను కిరాతంగా హత్య చేయడాన్ని ఖండించారు. ఇటువంటి వారికి రక్షణ కల్పించవలసిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. భాష కుటుంబానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. ఆయన వెంట వాకలపూడి వెంకటరత్నం, షరీఫ్, బాబు, పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు మజ్జిగ ఉపశమనం

విశాలాంధ్ర - కాకినాడ : ఎండ తీవ్రతకు మజ్జిగ మంచి ఉపశమనాన్ని ఇస్తుందని బాటసారిలకు మజ్జిగ పంపిణీ ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్ ఒంటిమామిడి సెంటర్లో రత్న మెడికల్స్ వార్షికోత్సవం సందర్భంగా స్వాతి హెల్పింగ్ హాండ్స్ కోశాధికారి కొత్త శ్రీరాములు ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమం జరిగింది. 100 లీటర్ల పెరుగును మజ్జిగగా కలిపి రుచికరంగా దహార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ మా క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఇంకా ముందు ముందు మంచి కార్యక్రమాలు చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్యామల, అలై కిరణ్ కుమార్, సతీష్, భవాని, సరళ, ధూళి శ్రీనివాసరావు, భవాని స్వీట్స్ బాబి, తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

ప్రమోషన్స్‌లో ఏబీసీ రిజర్వేషన్లు అమలు కొరకు వినతి

విశాలాంధ్ర-కొవ్వూరు: ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు మేరకు షెడ్యూల్ కులాల రిజర్వేషన్లలో కేటగిరీల వారీగా ఏబీసీ అమ లుకు ఆర్డినెన్స్ తెచ్చిన ప్రభు త్వం సంబంధిత డిపార్టుమెంట్ల యందు ప్రమోషన్స్‌లో కూడా అమలు చేసేవిధంగా జీ ఓ విడుదల చేయవలసిందిగా మంగళగిరి పార్టీ ఆఫీసులో బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు కొవ్వూరు నియోజకవర్గ ఉద్యోగులు వినతి పత్రం అందజేసినట్లు మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. జీ ఓ అమలుకు సహకరిం చవలసిందిగా లిడ్ కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాల రావుకు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యకు, చీఫ్ సెక్రటరీ పేషీలో, గౌరవ మంత్రి నారా లోకేష్ పేషీలో, సోషల్ వెల్ఫేర్ పేషీలో, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిలకు వినతి పత్రాలు అందజేసినట్లు ఉద్యోగ సంఘ ప్రతినిధులు దున్నా దుర్గారావు, ముప్పిడి ప్రకాష్ తెలిపారు.

యుద్ధ పరిస్థితులపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - సామర్లకోట : భారత్, పాకిస్తాన్ యుద్ధ పరిస్థితుల పట్ల ప్రజలు కనీస జాగ్రతలు చేపట్టాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కోరారు. బుధవారం సాయంత్రం సామర్లకోట మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో సామర్లకోట గడియారం సెంటర్ వద్ద ప్రజలకు యుద్ధ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ పరిస్థితులు ఏర్పడినందున వాయుదాడులు జరిగే అవకాశం ఉంద న్నారు. యుద్ధ పరిస్థితులపై అధికార యంత్రాంగం ప్రజలకు హెచ్చరికలు జారీచేస్తుందని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు ప్రజలు చేరుకోవాలని కమిషనర్ శ్రీవిద్య కోరారు. భయం వీడి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తాహాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అనంతరం సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగరావు యుద్ధ వాతావరణ పరిస్థితిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ పాక్ టెర్రరిస్టులపై చేసిన దాడికి మద్దతుగా ప్రజలతో మానవహారం నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర- తాళ్లపూడి : ప్రభుత్వం ప్రతి నెలా సోమవారం జరిపే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పదేపదే దరఖాస్తులు పెడుతూ అపరిష్కృతంగా ఉన్న ఆర్జీలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే కార్యక్రమాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన రెబ్బా ప్రగఢ సాయి కృష్ణ అనే వ్యక్తి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం జరిపినట్లు తాళ్లపూడి ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌భారతి పేర్కొన్నారు. ఆయన మూడు సమస్యలను ఎదు ర్కొంటుండగా, స్వంత భూమి 1.55 సెంట్లు ప్రభుత్వ భూమిగా గుర్తింపబడ్డదని ఫిర్యాదు కాగా జిల్లా కలెక్టర్ పరిధిలో పరిష్కార దిశలో ఉందని, గ్రామంలో 205/2 సర్వే నెంబర్‌లో సుబ్బరాజు చెరువు 6 సెంట్లు ఆక్రమణలకు గురైందన్న చెరువు స్థలాన్ని గుర్తించి ఆక్రమణలు తొలగించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకున్నామని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ తెలిపారు.

ప్రధాన మంత్రిపై ఫేస్ బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు

- వ్యక్తి అరెస్టు
- సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే జైలుకే
- సీఐ భీమరాజు, ఎస్ఐ చైతన్య కుమార్

విశాలాంధ్ర - మామిడికుదురు : సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, అభ్యంతరకరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని పి గన్నవరం సీఐ భీమ రాజు, నగరం ఎస్ఐ చైతన్య కుమార్ హెచ్చరించారు. బుధవారం నగరం పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పాశర్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ళ కిషోర్ యొక్క ఫేస్ బుక్ ఖాతాలో గోగన్నమఠం గ్రామానికి చెందిన కర్రి మోహన కనక దుర్గారావు అనే వ్యక్తి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టడంపై కిషోర్ నగరం పోలీసులకి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ పర్యవేక్షణలో రెండు బృందాలుగా ఏర్పడి పి గన్నవరం సీఐ భీమరాజు, నగరం ఎస్ఐ చైతన్య కుమార్ వారి సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ఫేస్ బుక్‌లో అభ్యంతర కరమైన పోస్టులు పెట్టిన వ్యక్తి గోగన్నమఠం గ్రామం ముత్యాలపాలెంకి చెందిన కర్రి మోహన కనక దుర్గారావుగా నిర్ధారించి బుధవారం అరెస్టు చేసి కోర్టుకి తరలించారు. ప్రజలు ముఖ్యంగా యువత ఎవరూ కూడా వారి యొక్క బంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అభ్యంతర అనుచిత పోస్టింగ్లు పెట్టకుండా ఉండాలని సూచించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో పోరాడాలి : కర్నాకుల

విశాలాంధ్ర-జగ్గంపేట, కిర్లంపూడి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు, మతోన్మాద, కార్పొరేట్ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. కిర్లంపూడి మండలం బురుగుపూడిలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే జగ్గంపేట మండలం మర్రిపాకలో అల్లూరి విగ్రహానికి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి రమేష్, జిల్లా నాయకులు రామ లింగేశ్వరరావు, పిడిఎస్‌యు(విజృంభణ) కె సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రమాద సంఘటనల విధానాలపై విస్తృత అవగాహన

కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు

విశాలాంధ్ర - కాకినాడ : రసాయన పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ప్రమాదాలు ఇతర సంక్షోభ సమయాల్లో ఏవిధంగా ప్రవర్తించాలో విస్తృత అవగాహన కల్పించాలని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కాకినాడ రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఆర్డీవో ఎస్ మల్లి..ఫ్యాక్టరీస్, అగ్ని మాపక శాఖ అధికారులతో కలిసి కాకినాడ డివిజన్ పరిధిలోని 13 ప్రమాదకర పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. రసాయనాలు తయారు చేసే పరిశ్రమలు చుట్టూ నివాసం ఉంటున్న ప్రజలకు అనుకోని సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో, ఇతర సంక్షోభ సమయాల్లో అనుసరించే విధానాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సందర్భాల్లో యాజమాన్యాలు అజాగ్రత్త చర్యల వల్లనే పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకుని అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నామన్నారు. ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధానంగా రసాయనాలు వినియోగించే పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిశ్రమల పరిసరాలలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవో మల్లి బాబు సూచించారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏ మురళీకృష్ణ, అగ్నిమాపక శాఖ అధికారి వీ సుబ్బారావు, కోరమండల్, ఏఎం గ్రీన్ అమ్మోనియా, రేక్ సిరామిక్, రిలయన్స్, ఓఎన్జీసీ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాయిరాం ఉడ్ వర్క్స్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు

విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం జార్జీపేట శివారు తూర్పుపేట జాతీయ హైవే ప్రక్కన నూతనంగా రాయుడు శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాయిరాం ఉడ్ వర్క్స్ మరియు పివిసి కిటికీలు మిషనరీని ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, పిల్లి సత్తిబాబు, జక్కల ప్రసాద్ బాబు, గంజా సూరిబాబు, పితాని విష్ణు, సూరంపూడి కుమార్, వస్కా రెడ్డి, దంగేటి సూరిబాబు, మల్లేశ్వరరావు, గోపి, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు. సుబ్బరాజు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ వ్యాపారాల్లో యుపివిసి వ్యాపారం ఎక్కువైనందు వలన అందరికీ అందుబాటు ధరల్లో చేయాలని కోరారు.

వరి కోతల పై రైతులు ఆందోళన

రైతులకు శాపంగా మారిన ఎన్ఆర్ఈజీఎస్ పథకం

విశాలాంధ్ర - అల్లవరం : వరి కోతల పై రైతులకు ఎన్ఆర్ఈజీ ఎస్ పథకం శాపంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దాల్వా పంటకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడంతో పంటకు దిగుబడి బాగా వచ్చిందని రైతులు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం వల్లన కూలీలు రాకపోవడంతో యంత్రాలు సాయంతో వరి కోతలు సాగుతుంది. అధిక వర్షం కురవడంతో మిషన్లు చేళ్లల్లో దిగలేని పరిస్థితుల్లో కూలీలు ద్వారానే కోతలు కోయించుకుని పరిస్థితి ఏర్పడింది. అల్లవరం పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం పనులు నిలుపుదల చేయాలని రైతులు అధికారులకి, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికి ఎక్కడ నిలుపుదల చేయకపోవడం తో మాకు ఆత్మ హత్యలే శరణ్యం అని రైతులు వాపోతున్నారు. చెల్లల్లో పూర్తి స్థాయిలో నీరు ఉండటంతో అటు యంత్రాలు రాకు, ఇటు కూలీలు రాక మా పరిస్థితి ఏమిటి అని ప్రజా ప్రతినిధులను అధికారులను రైతులు నిలదీస్తున్నారు. దీని పై పథకం పనులు ఆపకపోతే అప్పులు తీర్చలేక మా పరిస్థితి అతోగతిలా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. దీని పై అధికారులు స్పందించి అల్లవరం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు 10 రోజులు నిలుపుదల చేసి రైతులను ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

లేనిపోని ఆరోపణలు తగవు : టీడీపీ కౌన్సిలర్లు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : లేని పోని ఆరోపణలు చేస్తూ దినపత్రిక లలో వార్తలు రాస్తే తగదని టిడిపి కౌన్సిలర్లు ఎండ గుండి నాగబాబు, కోణాల వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లోని పాత్రికేయుల సమావేశం టిడిపి శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ దిన పత్రికలో అవాస్తవాలు ప్రచురించే ముందర నిజానిజాలు తెలుసుకుని వార్తలు ప్రచురించాలని వారు మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నామనేది అసత్యమని దీనిపై నిజనిర్ధారణ చేసుకునేందుకు ఏ దేవునిపై ప్రమాణం చేయమన్న చేసేందుకు వెనకాడబోమని వారన్నారు. అలాగే గత ఐదు సంవత్సరాల ప్రభుత్వ కాలంలో మీరు చేసిన అవినీతిపై ప్రతి ఒక్కటి తమ వద్ద ఆధారాలతో సహా ఉన్నాయన్నారు. ఇప్పటికీ ఎవరికి ఉపయోగపడని స్థలాలను అధిక ధరలకు కొని వాటిని జగనన్న ఇళ్ల స్థలాలకు ఇచ్చారని కానీ పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలే ఉన్నాయి గాని వాటికి సంబంధించిన ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో ఇప్పటికీ తెలియడం లేదని అన్నారు. కోణాల వెంకటరమణ, రాయుడు చిన్న, కర్రోతు గాంధీ, కిలారి రామచంద్ర, శశి స్వామి, బత్తుల రాజబాబు, సిడగం బాలు, గెద్ద అప్పన్న, ఎర్ర బాలకృష్ణ, పాల్గొన్నారు.

ఘనంగా భద్రకాళి సమేత వీరభద్రుడి సంబరం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రుడి సంబరం అతి వైభవంగా నిర్వహించారు. బుధవారం మల్లెపల్లి గ్రామంలో జాతీయ రహదారి ప్రక్కన ఆనుకుని ఉన్న భద్రకాళి సమేత వీరభద్రుని వార్షికోత్సవం గ్రామస్తులు ఇతర గ్రామస్తులు కలిసి అతి వైభవంగా నిర్వహించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ వార్షికోత్సవం నిర్వహిస్తారు. పాండ్రంగి అయ్యప్ప పర్యవేక్షణలో గ్రామ పెద్దలు ఇతర గ్రామస్తులు కలిపి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్ల వారుజాము నుండి వీరభద్రుల గంగ స్నానములు ఆచరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ భక్తులే కాకుండా ఇతర గ్రామాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమారాధన నిర్వహించారు.

గత 5 సంవత్సరాల్లో జరగలేని అభివృద్ధి,

నేడు చేసి చూపిస్తున్నాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గత ఐదు సంవత్సరాలలో జరగలేని అభివృద్ధి నేడు తమ ప్రభుత్వంలో చేసి చూపిస్తు న్నామని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ మేరకు రమణయ్య పేట గ్రామంలోని తొలుత దుర్గమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గ్రామంలోని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) చొరవతో రమణయ్యపేట, మార్కండేయపురం గ్రామాలలో తాగు నీటి సౌకర్యానికి సుమారు మూడు లక్షల రూపాయల వ్యయంతో రెండు నూతన బోర్వెల్ లకు ఎమ్మెల్యే సత్య ప్రభ చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేపట్టారు. అనంతరం ఏలేశ్వరం వెలుగు కార్యాలయం నందు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయం నందు రైతులకు సుమారు 26 లక్షల రూపాయల వ్యయంతో వ్యవసాయ పనిముట్లను ఆయా రైతులకు అందజేశారు. అనంతరం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీవో కెవి సూర్య నారాయణ, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), సూతి బూరయ్య, పసల సూరిబాబు, చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు, రెడ్డి వరలక్ష్మి (బిజెపి), కొప్పుల బాబ్జి, అలకరాజు, బుద్ధ సూర్యప్రకాష్, బ్యాంకు రాజు, శ్రీధర్, మైరాల కనకారావు, జిగటాపు సూరిబాబు, వేంకటేశ్వర రావు, పలివెల శ్రీను, గంగిరెడ్డ మణి కంఠ, కర్ణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు వర్ధంతి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : భారతదేశ ముద్దుబిడ్డ, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ అసోసి యేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో అల్లూరి సీతారామ రాజు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగతా శివ మాట్లాడుతూ అల్లూరి ఆశయాల స్ఫూర్తిగా ప్రజల హక్కుల కోసం, వారి న్యాయమైన సమస్యల పైన న్యాయవాదులు పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమ ంలో న్యాయవాది, ఐలాజ్ రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవి, బందారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పిసిసి మెంబరు ధర్నాలకోట శ్రీను ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డు గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు.

వినూత్న రీతిలో ఉద్యోగులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-అమలాపురం : రాష్ట్రం లో ఏ జిల్లాలో చేపట్టని విధంగా వినూత్న రీతిలో ఉద్యోగులలో సామర్థ్యాలను పెంపొందించేం దుకు క్విజ్లు నిర్వహించడం జరుగుతుం దని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు రెవెన్యూ సర్వే ఉద్యోగులకు రౌండ్ టేబుల్ వారీగా మండలానికి ఎనిమిది మంది చొప్పున ఎంపిక చేసిన ఉద్యోగులతో 22 టేబుళ్లు ఏర్పాటు చేసి మూడు రౌండ్ల క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగు పరచడానికి క్విజ్‌లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఉద్యోగులకు కెరీర్ వృద్ధికి మద్దతు నిలుస్తుందన్నారు. రెవెన్యూ సర్వే ఉద్యోగుల విధి నిర్వహణలో భాగంగా సమర్థవంతంగా విధులు నిర్వహిం చేలా స్పష్టమైన అవగాహనను క్విజ్లు కల్పిస్తాయన్నారు. రెవెన్యూ, సర్వే ప్రభుత్వ ఉద్యోగుల పని తీరులో సామర్థ్యాలను పోటీతత్వాన్ని ప్రోత్సహించే దిశగా క్విజ్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, ఆర్డీవోలు పి శ్రీకర్ కే మాధవి, డి అఖిల, జిల్లా పౌర సరఫరా అధికారి ఏ ఉదయ్ భాస్కర్, ఏవో కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలు చేస్తున్న ఆరోపణలు మానుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గత 20 రోజులుగా సమ్మె చేపట్టిన ఎంఎల్ హెచ్‌పీలు చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని ఏలేశ్వరం అర్బన్, రూరల్ ఏఎన్ఎంలు హెచ్చరించారు. రాత్రనకా, పగలనక ప్రతి నిత్యం ప్రజా ఆరోగ్య కోసం పాటుపడుతున్న ఏఎన్ఎంల పనితీరుపై ఎంఎల్ హెచ్‌పీలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమన్నారు. వారికి ప్రభుత్వం కొన్ని బాధ్యతలు అప్పజెప్పారని వాటిని సక్రమంగా నిర్వహించలేక తమపై ఆరోపణలు చేస్తున్నా రన్నారు. ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు పని గంట లతో సంబంధం లేకుండా వైద్యసేవలు అందిస్తున్న తమను కించపరుస్తూ మాట్లాడే అర్హతవారికి లేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సిహెచ్ఓ పి మాణిక్య కుమారి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏలేశ్వరం అర్బన్, రూరల్ ఏఎన్ఎంలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం

వహిస్తే ఊరుకునేది లేదు : ప్రభుత్వ విప్ దాట్ల

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం టీడీపీ పార్టీ నాయకులు ధూళిపూడి వెంకటరమణ, జక్కల ప్రసాద్ మండలంలో ధాన్యం కొను గోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వ విప్, ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు కు తెలిపారు. బొండాలు రకం ధాన్యం కొనుగోలులో మిల్లర్లు వంద రూపాయలు తగ్గించి కొనుగోలు చేస్తాం అంటున్నారని, దీనివలన కూటమి ప్రభుత్వంకు చెడ్డ పేరు వస్తుంది అన్నారు. కాకినాడ సివిల్ సప్లై డియం నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితు ల్లోనూ ప్రతీ ధాన్యం కూటమి ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేని పక్షంలో మిల్లర్లు పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర - కాజులూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక, కొంతమంది బీసీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, నియోజకవర్గ బీసీ సెల్ కో ఆర్డినేటర్ మేడిశెట్టి వివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల బీసీ సెల్ అధ్యక్షులు వల్లు అర్జున్‌రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వనుం వీరబ్రహ్మం మాట్లాడుతూ, కొంతమంది బీసీ నాయకులం అంటూ పేరు చెప్పుకునే నేతలు కావాలనే కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. బీసీ సెల్ కోఆర్డినేటర్ వివి సత్యనారాయణ మాట్లాడుతూ, కాజులూరు మండలంలోని ప్రభుత్వ కుట్టుమిషన్ శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 150 కోట్లు, కాజులూరు మండలంలో 41 లక్షల, 60 వేలు రూపాయలు దోచుకునేందుకు, ప్రణాళిక రూపొందించారు అంటూ కొంతమంది బీసీ నాయకులు ఆరోపణలు చేయడం తగదంటూ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం బీసీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిందని, ఆ ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వాస్తవాలు తెలియకుండా అసత్య ఆరోపణలు చేస్తే తగిన విధంగా వారికి చెప్పాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిజాస్టర్ ఎవాక్యుయేషన్ ప్లాన్ పై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహణ

విశాలాంధ్ర - కాకినాడ : ఇటీవల పహల్గామ్ పై తీవ్రవాదుల దాడి, తదుపరి ప్రస్తుత “ఆపరేషన్ సిందూర్” పరిస్థితి దృష్ట్యా డిజాస్టర్ ఎవాక్యుయేషన్ ప్లాన్ పై కాకినాడ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కాకినాడ పరిసర ప్రాంతాలలో గల ఇండస్ట్రీస్ ప్రతినిధులతో కమిషనర్, జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో విపత్తు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తక్షణ తరలింపు చర్యలు, సురక్షిత ప్రాంతాల గుర్తింపు, కమ్యూనికేషన్ ప్రోటో కాల్స్ పై చర్చ జరిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో విపత్తు ఎదురుకునేందుకు ప్రతీ నెల మాక్ డ్రిల్ల నిర్వహించడం జరుగుతుందని, ఏదైనా విపత్కర పరిస్థితి ఎదుర్కొనుటకు సిద్ధంగా ఉండుటకు సూచనలు జారీ చేయడం జరిగిందని కమిషనర్‌కు వివరించారు. మొత్తంగా 53 పరిశ్రమలు ఈ సమావేశంలో పాల్గొనగా వారి సన్నద్ధత పై రిలయన్స్, కోరమండల్, ఎన్‌సిఎన్, దేవి ఫిషరీస్ మరియు ఇతర పరిశ్రమల స్పందన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి సుధాకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ప్రమోద్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళులు

విశాలాంధ్ర-ఏలూరు: దేశంకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో బుధ వారం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చి oదన్నారు. జాతికి అల్లూరి చేసిన సేవలను ఆమె కొని యాడారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వ రరావు, సెట్ వెల్ సిఇఓ కె.ఎస్.ప్రభాకరరావు, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, సహాయ పర్యాటక శాఖ అధికారి పట్టాభి, కలెక్టరేట్ ఆవరణలోని వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్‌లోని పలు విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం : కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చదలవాడ నాగరాణి కొనియాడారు. బుధ వారం అల్లూరి వర్ధంతి సందర్భంగా భీమ వరం జువ్వలపాలెంరోడ్డు లోని అల్లూరి సీతారామ రాజు స్మృతి వనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాంస్య విగ్రహం వద్ద పూలమాలలు ఉంచి నివాళు లర్పించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి, సంఘసేవకులు కంతేటి వెంకటరాజు, లయన్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, ఉద్దరాజు విశ్వనాధరాజు, సుబ్బరాజు, పాల్గొన్నారు.

సివిల్ మాక్ డ్రిల్‌లో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర-ఏలూరు: దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా.. జిల్లాలో ముంద స్తుగా భద్రతపై మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసర సేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ మాక్ డ్రిల్ అంశంపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత శాఖల అధికారు లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణకై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్, మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రధానంగా జిల్లాలో వివిధ పారిశ్రామిక సంస్థల్లో ఖచ్చితంగా పౌర భద్రతా ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహిం చాలన్నారు. మాక్ డ్రిల్ నిర్వహించిన అనంతరం ఫొటోలతో కూడిన సంబంధిత రిపోర్టులను కలెక్టరే ట్‌కు అందజేయలన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల్లో ని సంబం ధిత అధికారులతో కలిసి పౌర రక్షణ ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల న్నారు. అందులో భాగంగా చేపట్టే రిహార్సల్స్, మాక్ డ్రిల్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

పోలీస్ పహారాలో

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - కాకినాడ క్రైమ్ : పోలీస్ పహారాలో కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ కొత్తవర్గం ఎన్నికైంది. కాకినాడ సంజయ్ నగర్‌లోని కాకి నాడ లారీ ఓనర్ అసోసి యేషన్ వద్ద బుధవారం ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశంతో సద్దుమణిగిన ఘర్షణ వాతావరణ లో స్టీరింగ్ కమిటీ సభ్యులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించుకు న్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడైన దాసరి శ్రీను స్థానంలో కొత్త అధ్యక్షుడిగా గూడపల్లి మృత్యుంజయ రావుని ఎన్నుకున్నారు. కార్యదర్శి అల్లంరాజు, కోశాధికారి శ్రీనివాసరావు ఉపాధ్యక్షులు గంగాధర్‌రావు, వెంకట అర్జున్ రాజు, సంయుక్త కార్యదర్శులను యధా విధిగా కొనసాగుతారని తీర్మానించుకు న్నారు. ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాస్‌రావుకి అతనికి వ్యతిరేకంగా ఏర్పడిన స్టీరింగ్ కమిటీకి తోపులాటలు జరగడం కొన్ని రోజుల క్రితం జరిగినవివాదం అందరికీ విధితమే. అప్పటి నుంచి ఈ ఇరువర్గాలకు మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధ వారం ఘర్షణ వాతావరణం తలెత్తడంతో లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా ముందుగానే సుమారు 80 మంది పోలీసుల పహారాతో పోర్టు పోలీస్ స్టేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇరు వర్గాలపై పోలీసులు బైండోవర్ కేసులు విధించి ఉన్నారు. ఆర్డీఓ ఆఫీస్‌కి వచ్చినప్పుడు ఈ వివరాలను దాసరి శ్రీనివాస రావు తెలియజేశారు. ఎస్పీ మనీష్ పాటిల్ ఐపీఎస్ లా అండ్ ఆర్డర్‌కు ఎటువంటి సమస్యలు రాకుండా సుమారు 80 మంది పోలీసులతో లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చేరుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా శాంతంగా పరిష్కరించుకోవాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఇరువర్గాలకు సూచించారు. దానికి రెండు వర్గాల వారు అంగీకరించారని తెలియజేశారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయిస్తాం

వైకాపా జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చెర్ల జగ్గిరెడ్డి

విశాలాంధ్ర - అమలాపురం : "గోదావరి డెల్టాలో రబీలో పండిన ధాన్యాన్ని తక్కువ చేసి చూపిస్తున్నారు. పండిన పంటలో పావు వంతు కూడా కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోలేదు. పెట్టుకున్న లక్ష్యంలో సగం కూడా కొనుగోలు చేయలేదు. దళారులు..మిల్లర్లు దోపిడీ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం రబీ ధాన్యం కొనుగోలు విధానం కొనసాగుతోంది. రైతు నష్టపోయే చర్యలను వైసీపీ పార్టీ ఉపేక్షించదు. కూటమి ప్రభుత్వం మెడలు వంచి ప్రతి గింజా ధాన్యం కొనుగోలు చేయిస్తాం' అని వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రబీలో పండిన ధాన్యం కొనుగోలు దయనీయంగా సాగు తుండడంపై వైసీపీ కన్నెర్ర చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన అమలాపురం కలెక్టరేట్ సమీపంలో ఒంటెద్దు సూర్య నారాయణరావు కాంప్లెక్స్ వద్ద బుధవారం వైఎస్ఆర్‌సీపీ రైతు రిలేదీక్ష చేపట్టింది. కోనసీమ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీకి చెందిన శాసనమండలి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ రైతు విభాగం నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 'జిల్లాలో రబీ పంట బాగా పండినా రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చిందంటే అందుకు కూటమి ప్రభుత్వ బాధ్యత వహించాలి' అని డిమాండ్ చేశారు. అధికారులు 5.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వచ్చిందని చెబుతున్నారు. కాని వాస్తవంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. కాని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా తొలుత రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు లక్ష్యం పెట్టింది. ఈ రిలే దీక్షలు ఉమ్మడి తూర్పు గోదావరి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, తూర్పు గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల్, పార్టీ పీఏసీ సభ్యుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారా యణ రావు, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పిల్లి సూర్య ప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, పినిపే శ్రీకాంత్, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీ దేవి కాశి బాలమునికుమారి వంగా గిరిజాతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీగా పనిచేయాలి

ఎంపీ మహేష్ సూచన

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజ లకు జవాబుదారీగా పనిచేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. ఏలూరు శాంతినగర్‌లోనిఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం 'ప్రజాదర్బార్' నిర్వహించారు. పార్లమెంట్ నియో జకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎంపీ మహేష్ అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యలను సావధానంగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా కల్పించారు. తక్షణమే స్పందించిన ఎంపీ మహేష్ కుమార్ అప్పటి కప్పుడు అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వారికి వివరించి, పరిష్కరిం చాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకు ఓర్చి కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇచ్చిన అర్జీలను తమ సిబ్బంది ఆన్లైన్ చేస్తా రని తెలిపారు. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి సంబంధించిన పురో గతిని అర్జీదారులకు ఫోన్ చేసి సమాచారం అందిస్తారని ఎంపీ పేర్కొన్నారు. తాను లేని సమయంలో కూడా కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగం ద్వారా అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఎప్పుడైనా తన క్యాంపు కార్యాలయానికి వచ్చి సేవలు వినియోగించుకోవాలని ఎంపీ మహేష్ కుమార్ సూచించారు.

జగ్గంపేటలో మాక్ డ్రిల్

విశాలాంధ్ర - జగ్గంపేట : పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై భారత్ ఆర్మీ దాడి నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ బుధవారం జగ్గంపేటలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్ ప్రతి దాడి చేస్తుందనే ఉద్దేశ్యంతో ముందుగానే ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 1968 పౌర రక్షణ చట్టం ప్రకారం పాటించవలసిన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ చేశారు. అగ్నిమాపక అధికారులు, రెవిన్యూ అధికారులు, పంచాయితీ రాజ్ అధికారులు, సచివాలయ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం నుండి పంచాయితీ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. పాకిస్తాన్ పై యుద్ధ సమయంలో వారు బాంబు దాడి చేస్తే ఏవిధంగా తప్పించుకోవాలి అనే విషయాలను తెలియజేస్తూ మాక్ డ్రిల్ చేశారు. బాంబు దాడి చేస్తుందని అంచనాలు తెలియగానే సైరన్ మోగుతుందని అప్పుడు ఇళ్లలో నుండి బయటకు వచ్చి నేల మీద పడుకోవాలని అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా తెలియజేశారు. తహశీల్దార్ జెవిఆర్ రమేష్, ఎంపిడిఒ ఏవిఎస్ చంద్రశేఖర్, అగ్నిమాపక ఎస్ఐ లక్ష్మణరావు, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, పంచాయితీ కార్యదర్శులు, విఆర్ఓలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా దోపిడీకి వ్యతిరేకంగా అల్లూరి పోరాటం

విశాలాంధ్ర-కొవ్వూరు: రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన మన్యం విప్లవ వీరుడు స్వతంత్ర సమరయోధుడు తెలుగుజాతి గర్వించదగిన గొప్ప యోధుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ అల్లూరి ఆశయాల సాధనలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సీపీఎం ముందుకు సాగుతుందని భారత ప్రభుత్వం అటవీ సంపద ఖనిజాలను కార్పొరేట్లకు అప్పగిస్తుంటే ఆదివాసీల పక్షాన సీపీఎం సమరశీల పోరాటాలు నిర్వహిస్తు న్నదన్నారు. గత కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర్ బాబు దగ్గు అశోక్ కే. కనకారావు డి.రాధాకృష్ణ ఎం జ్యోతిబాసు ఎం.వీర బాబు పాలచర్ల జగన్నాథం వై ఈశ్వర రావు ఎస్.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.